స్వచ్ఛ పట్టణంలో సులభ్ కష్టాలు

- ఎమ్మిగనూరులో మూత్ర శాలలు లేక ప్రజల అవస్థలు
- బహిరంగ ప్రదేశాల్లోనే మూత్ర విసర్జన
- దుర్గంధంతో ఇబ్బందులు



ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం


నీటి వసతి లేకపోవడంతో తాళం వేసి వుంచిన పబ్లిక్ టాయిలెట్

ఎమ్మిగనూరుటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో స్వచ్ఛ పట్టణంగా పేరుపొందిన ఎమ్మిగనూరు పట్టణంలో రద్దీ ప్రాంతాల్లో మూత్రశాలలు లేకపోవడంతో పలు పనుల నిమిత్తం పట్టణంలో వచ్చిన ప్రజలు బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నారు. ఉచిత మూత్రశాలలు లేకపోవడంతో, ఉన్నవి నిరుపయోగంగా ఉండటంతో ఏమురుగు కాలువలో, ప్రహరిగోడల చాటునో పనికానిచ్చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రజలు అటుగా వెళ్తే ముక్కుపుటలదిరేలే దుర్గంధం వెదజల్లుతుండటంతో ముక్కు మూసుకోవాల్సి వస్తోంది.

రద్దీ ప్రాంతాల్లో ఇబ్బందులు

1.29లక్ష మందికి పైగా జనాభా వున్న పట్టణం. నిత్యం నియోజకవర్గంలోని పలు గ్రామాలు, వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో ఏదో ఒక పని మీద ప్రజలు పట్టణానికి వస్తుంటారు. పురుషులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు రాకపోకలు సాగించే పట్టణంలో పలు ప్రాంతాల్లో మూత్ర విసర్జన కోసం పడుతున్న కష్టాలు వర్ణణాతీతంగా వుంటున్నాయి. ఇక మహిళలు పడే ఇబ్బందులు చెప్పుకోలేనివి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, సోమప్ప సర్కిల్, కూరగాయల మార్కెట్, పోస్టాఫీస్ రోడ్‌లలో మాత్రం పెయిడ్ సులభ్ కాంప్లెక్స్‌లున్నాయి. అయితే వాటిలో మూత్ర విసర్జనకు కొంత డబ్బు వసూలు చేస్తుండటంతో అటువైపు చాలామంది వెళ్లడం లేదు. పోస్టాఫీసు రోడ్‌లో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లో మూత్రశాలలు లేకపోవడంతో అటువైపు ఉన్న ప్రహరీలను ఆశ్రయిస్తున్నారు. గతంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బహిరంగ మూత్ర విసర్జన పెరిగిపోవడంతో ఆదే ప్రాంతంలో సులభ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఆ ప్రాంతంలో బహిరంగ మూత్ర విసర్జన కొంత తగ్గినా.. ప్రహరీ పక్కన మాత్రం అలానే కొనసాగుతోంది.

బహిరంగ ప్రదేశాల్లోనే..

రద్దీగా వుండే మరికొన్ని ప్రాంతాల్లో మూత్రశాలలు లేకపోవడంతో అత్యవసర సమయంలో ప్రజలు పడే అవస్థలు వర్ణణాతీతంగా వుంటున్నాయి. పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద, పంప్‌హౌస్ సమీప ప్రాంతాల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు నిత్యం బహిరంగ మూత్ర విసర్జన కొనసాగిస్తుండటంతో ఆ ప్రాంత గుండా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. అదేవిధంగా స్టేట్‌బ్యాంక్, వైఎస్సార్ సర్కిల్, ట్యాంక్‌బండ్ రోడ్డు, గాంధీ సర్కిల్, షరాఫ్‌బజార్, శ్రీనివాససర్కిల్, శివ సర్కిల్ తదితర ప్రాంతాల్లో నిత్యం గ్రామీణులు, పట్టణ ప్రజలతో రద్దీగా వుంటుంది. దీంతో ఆయా ప్రాంతాల్లో అనువైన చోట పురపాలిక అధికారులు కనీసం మూత్రశాలలనైనా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా మూత్రశాలలు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రహరీతో పాటు మరో ప్రాంతంలో టాయిలెట్లను అధికారులు ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా దానిని ప్రారంభించలేదు. దీంతో పాదచారులు తాళం వేసి వున్న మూత్రశాల ముందే గత్యంతరం లేక అత్యవసరమయి మూత్రవిసర్జన చేసేస్తున్నారు. మూత్రశాలలకు నీటి సరఫరాతో పాటు నీటి ట్యాంక్, తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయకపోవడంతో అది ఉపయోగంలోకి తీసుకొనిరాలేకపోతున్నారు. పట్టణంలో రద్దీ ప్రదేశాలు గుర్తించి మూత్రశాలలను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు



ప్రజల అవసరాలకు తగినట్లు పట్టణంలోని శ్రీనివాస సర్కిల్, శివసర్కిల్, సోమేశ్వర్ థియేటర్, ఎంబీ చర్చి, ఓంశాంతి సర్కిల్ ప్రాంతాల్లో టాయిలెట్లు ఏర్పాటుకు టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అయితే ఆయా ప్రాంతాల్లోని ఎంపిక చేసిన స్థలాల వద్ద వుండే వారు కొంత వ్యతిరేకిస్తున్నారు. అయినప్పటికీ ప్రజల సౌకర్యార్థం తగిన చర్యలు తీసుకొని సులభ్ కష్టాలు పరిష్కరిస్తాం. జూనియర్ కళాశాల ప్రహరీ వద్ద ఏర్పాటు చేసిన టాయిలెట్‌తో మున్సిపాలిటీ వారికి సంబంధం లేదు. కాంట్రాక్టర్ తెచ్చి పెట్టాడు. దానిని కాంట్రాక్టర్ వెనక్కి తీసుకెళ్లాల్సివుంది.
– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

క్లుప్తంగా

ముగిసిన దశమి ఉత్సవాలు


చింతలాముని స్వామి, నల్లారెడ్డి స్వామి

గోనెగండ్ల : గోనెగండ్లలో వెలసిన శ్రీచింతలాముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు మంగళవారం ఆరాధనోత్సవాలతో ముగిశాయి. దశమి వేడుకలు 12వ తేదీ నుంచి ప్రారంభమై 16వ తేదీ వరకు జరిగాయి. పల్లకీ సేవ, దశమి, సాంస్కృతిక, పారువేట ఉత్సవం, ఆరాధన ఉత్సవాలకు గ్రామం నుంచే కాక పలు రాష్ట్రాల నుంచి భక్తులు, పలు రాజకీయ నాయకులు హాజరై స్వాముల వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రాత్రి స్వామి భక్తి గీతాలతో భజన కార్యక్రమం నిర్వహించి అన్నదానం చేపట్టారు. సీఐ విజయభాస్కర్ దశమి ఉత్సవాల సందర్భంగా అదనపు బలగాలతో గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఎమ్మిగనూరు మార్కెట్‌లో ఉల్లి కొనుగోళ్లు

ఆదోని రూరల్: ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డులో గురువారం, శుక్రవారాల్లో ఉల్లి కొనుగోలు నిర్వహించనున్నట్లు ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలో ఉన్న ఉల్లి రైతులు తప్పనిసరిగా పంట పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాతనే కోత కోయాలన్నారు. పండిన ఉల్లిని ఆరబెట్టి, సరైనవిధంగా గ్రేడింగ్ చేసిన తరువాతే మార్కెట్‌కు తీసుకొని రావాలని సూచించారు. అప్పుడే పంటకు ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర లభిస్తుందని స్పష్టం చేశారు. అలాగే పంట పక్వానికి రాకముందే ఉల్లిని కోయడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర సమస్యలు వస్తాయన్నారు. కాబట్టి రైతులు తమ శ్రమ వృథాగాకుండా చూసుకోవాలన్నారు.

బదిలీ ఉపాధ్యాయురాలికి సన్మానం


ఉపాధ్యాయురాలు రుక్మిణిని సన్మానిస్తున్న ఎంఈఓ మెహినుద్దీన్

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు రుక్మిణి ఎమ్మిగనూరుకి బదిలీ అయ్యారు. మంగళవారం గ్రామంలోని పాఠశాలలో ఎంఈఓ మెహినుద్దీన్, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తున్న రుక్మిణిని పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగమ్మ, ఉపాధ్యాయులు కవిత, ఏస్తేరమ్మ, సుష్మ ఏంజెల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం



రామకృష్ణ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని మరాఠీగేరికి చెందిన రామకృష్ణ(18) అనే యువకుడు మంగళవారం వెంకన్న బావిలో శవమై తేలాడు. మృతుడి పెద్దమ్మ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వారు తెలిపిన మేరకు వివరాలు.. రామకృష్ణకు తల్లిదండ్రులైన రంగస్వామి, హుసేనమ్మ గతంలోనే మృతిచెందారు. మృతుడు బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో వెతికారు. కాగా, మంగళవారం వెంకన్నబావిలో శవమై తేలాడు. తల్లిదండ్రులు లేకపోవడం, ఒంటరితనంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆదోని రూరల్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఏఐడీడబ్ల్యూఏ) మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం ఆదోని మండల మహాసభలో మండల అధ్యక్ష, కార్యదర్శులుగా బి.పద్మ, కె.ఉమాదేవిలను ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యులుగా కె.నరసమ్మ, కె.మునెమ్మ, పి.దస్తగిరమ్మ, కిష్టమ్మ, ఉష, సోమక్క, దేవమ్మ, రిజ్వానాలను కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

బారికేడ్ల తొలగింపు



మంత్రాలయం : మండలం కేంద్రంలోని నాగలదిన్నె రహదారిలో శ్రీమఠం అధికారులు వాహనాలు నిలపకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లను మంగళవారం తొలగించారు. 8 నెలలుగా శ్రీమఠం అధికారులకు సంబంధం లేకున్నా ఆర్అండ్‌బీ రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసి తమ అధికారాన్ని చెలాయించారు. ఈ సమస్యపై ఇటీవల స్థానిక ఏఐవైఎఫ్ నాయకులు ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఆర్అండ్‌బీ అధికారులు నాగలదిన్నె రోడ్డులో శ్రీమఠం ఏర్పాటు చేసిన బారికేడ్లను జేసీబీతో తొలగించారు.

ఐరన్‌బండలో పోలీసుల సోదాలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు

గోనెగండ్ల : మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో వారం రోజుల క్రితం ఇరు సామాజిక వర్గాలకు చెందిన వారి మధ్య దాడులు జరిగాయి. దీంతో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 100కు ఫోన్ చేసి ఐరన్‌బండ గ్రామంలో హత్యలు చేసుకునేందుకు ఇరువర్గాల వారు మారణాయుధాలతో సిద్ధంగా ఉన్నారని చెప్పడంతో గోనెగండ్ల పోలీసులు అలర్ట్ అయ్యారు. మంగళవారం ఉదయం గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, ఒక పీఎస్ఐ, 51 మంది పోలీస్ కానిస్టేబుల్స్ ఐరన్‌బండ గ్రామానికి వెళ్లి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇరు వర్గాలకు చెందిన అనుమానిత వ్యక్తుల ఇళ్లలో పోలీసులు సోదాలు చేశారు. అయితే గ్రామానికి చెందిన పది మంది వ్యక్తుల దగ్గర ఎలాంటి పత్రాలు, నెంబర్ ప్లేట్స్ లేని 10 ద్విచక్రవాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ విజయభాస్కర్ గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. గొడవలకు దూరంగా ఉండి కుటుంబంతో సంతోషంగా గడపాలన్నారు. ఇరువర్గాల వారికి పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

జీడీపీలో మునిగిన పంటల పరిశీలన


నీట మునిగిన పంటలను పరిశీస్తున్న అధికారులు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని ఐరన్ బండ గ్రామం పంట పొలాలను మంగళవారం అధికారులు పరిశీలించారు. తాము సాగు చేసిన పంట పొలాలు జీడీపీ నీటిలో మునిగిపోయి రైతులు నష్టపోయామని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని ఐరన్‌బండ గ్రామానికి చెందిన రైతులు ఇటీవల కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జీడీపీ ఏఈ మహమ్మద్ అలీ, సర్వేయర్ రవేలామ్మతో పాటు రెవెన్యూ సిబ్బంది మంగళవారం ఐరన్‌బండ గ్రామంలోని జీడీపీ ఎగువ ప్రాంతంలోని పంట పొలాలను పరిశీలించారు. ఏఏ పంట పొలాలు నీటిలో మునిగిపోయాయని, ఏయే పంటలు ఎన్ని ఎకరాలలో నష్టపోయారో పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు వర్క్ఇన్‌స్పెక్టర్ ఉగ్రనరసింహ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణి మృతిపై విచారణ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని నర్సింగ్‌హోమ్‌లో వైద్యుల నిర్లక్షంతో సూగూరుకు చెందిన ఓ గర్భిణి మృతి చెందిందన్న ఆరోపణలపై మంగళవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి మంగళవారం విచారణ జరిపారు. మృతురాలి స్వగ్రామమైన మంత్రాలయం మండలంలోని సూగూరు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఆమె విచారించారు. అనంతరం సంబంధిత నర్సింగ్‌హోమ్‌కు వెళ్లి అందించిన చికిత్స గురించి వైద్యులను ఆరా తీశారు. స్థానిక ఎంపీహెచ్ఈఓ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

నందవరం : విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని వంట ఏజెన్సీ సభ్యులకు ఎంఈఓ-2 రఘునాథ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కొత్త కైరవాడి, నది కైరవాడి గ్రామాల్లో మధ్యాహ్న భోజనం, రికార్డులను ఎంఈఓ-2 పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు అందించే డొక్కా సీతామ్మ మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. ముఖ్యంగా వంట గదులు, తాజా కురగాయాలు వాడాలన్నారు.

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుదాం

కోసిగి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని హిందూ గర్ల్స్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సంజన్న అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల ఆవరణలో చీపురు పట్టి శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీ వరకు పాఠశాలలో విద్యార్థులకు రోజుకు ఒక విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసయ్య, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మదిరేపల్లి శివశంకర్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని కడివెళ్ల గ్రామాలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంటల నమోదు చేయించుకోకపోతే ప్రభుత్వ పథకాలైన ఇన్సూరెన్స్, పంట నష్టం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్ర పనిముట్లు వంటివి రైతులకు అందవన్నారు. కార్యక్రమంలో ఏఈవో వినోద్, వీఏఏ హనిమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బనవాసి కేవీకేను సందర్శించిన రైతులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని మంగళవారం జిల్లా నవయూత్ అసోసియేషన్ నుంచి 25 మంది రైతులు అవగాహన పర్యటన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవీకే సమన్వయకర్త డా. రాఘవేంద్రచౌదరి మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణ, వర్మి కంపోస్ట్ తయారి గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటే మీరు రైతులకు వివరించే అవకాశం ఉంటుందని తెలిపారు. వర్షాలు అధికంగా ఉన్నందున రైతులు మిరప, పత్తి, ఉల్లి పంటలలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటిస్తే వైరస్ తెగులు నుంచి రక్షణ పొందటంతో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు డా. నిరంజన్‌రెడ్డి, మౌనిక, శ్రీచందన, తేజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ఓజోన్ పొరను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని స్థానిక ఎంఎస్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులతో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మంత్రాలయం రూరల్ : రైతులు పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏఓ నాగ సరోజమ్మ, ఏడీఏ మహమ్మద్ ఖాద్రి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాధవరం, రచ్చుమర్రి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తి పంటలో తీసుకోవాలిసిన జాగ్రత్తలపై రైతులు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ..వర్షపు నీటిని బయటకు పంపాలని, అలాగే పత్తి కాయలు పగలటానికి పోటాషియం నైట్రిట్ 5 గ్రాములు లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ గణేష్, ఏఈఓ తిరుమలరెడ్డి, వీఏఏ రాజేష్, విజయ్, సురేంద్ర, రంజాన్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్ పంపిణీ


ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేసిన ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: నేషనల్ మీన్స్ మెరిట్ కం స్కాలర్‌షిప్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను ఆంధ్ర ప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య ఆధ్వర్యంలో పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు జంగం బసవరాజు, నిరంజన్ కుమార్, ఎల్లాగి సుధాకర్ మంగళవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ స్టడీ మెటీరియల్స్ కేవలం స్కాలర్‌షిప్ పరీక్షలకే కాకుండా భవిష్యత్తులో పోటీ పరీక్షలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులు 9 వతరగతి నుంచి ఇంటర్మీడియట్ అంటే 12వ తరగతి వరకు స్కాలర్ షిప్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎంటీఎఫ్ నాయకులు సురేష్ కుమార్, ఈశ్వరయ్య, నూర్ ఉల్హక్, బడుగు బసవరాజు, గుర్రప్ప పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

నందవరం : గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని, చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈఓపీఆర్డీ సందీప్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాయచోటి గ్రామంలో చెత్త సేకరణ, పరిశుభ్రతపై మహిళలకు, గ్రామస్తులకు ఈఓపీఆర్డీ అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ..పారిశుద్ధ్య కార్మికులు తడి, పోడి చెత్తలను వేరు చేసి చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రజలు ఇంటిలోని చెత్తను బయటపడేయకుండా, చెత్త డబ్బాలలో వేసుకుని పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ వాడకంపై అవగాహన

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ వాడకంపై విద్యార్థినులకు ఆర్‌డబ్ల్యూఎఫ్ సంస్థ మాస్టర్ ట్రైనర్ డా. సంధ్యరాణి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మార్కెట్లో దొరికే ప్లాస్టిక్, సింథటిక్ ప్యాడ్స్ వాడకం వలన కలిగే రుగ్మతలను వివరించారు. సురక్షితమైన ఆర్గానిక్ ప్యాడ్స్ వినియోగించడం వలన ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ కుడా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంతోష, ఎన్ఎస్ఎస్ అధికారులు జోనాథన్ వీక్లిఫ్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోరాట సభను జయప్రదం చేయండి

కౌతాళం: సమగ్ర శిక్షా కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 10వ ఆవిర్భావ దినోత్సవ సభను (దశాబ్ద ఐక్యత భవిష్యత్తు పోరాట సభ)ను జయప్రదం చేయాలని జిల్లా జేఏసీ నాయకులు శాంతరాజు పిలుపునిచ్చారు. కౌతాళంలోని ఎంఆర్‌సీ భవనం వద్ద అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అక్టోబర్ 12న చెపడుతున్న పోరాటసభకు అందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామాంజినేయులు, మాబాషా, రమేష్, హైమవతి, రామన్న, వరదరాజులు, సాయి కుమార్, షబాన ఉన్నారు.

రేపు స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: ఈనెల 18వ తేదీన ఆదోని పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో 16వ విడత స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేస్తున్నట్లు అవోపా మాజీ అధ్యక్షుడు కాకుబాళ్ నగేష్, ఆదోని అవోపా పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పుష్యమి నక్షత్రం రోజున (18-09-2025)న ఉదయం 7 గంటలకు అమూల్యమైన వెలకట్టలేని ఈ మందులను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ ఔషధం వల్ల రోగ నిరోధకశక్తి, మేధాశక్తి పెరగడంతో పాటు మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఈనెల 18వ తేదీలోపు 98494 78178 నంబర్‌కు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని రూరల్: కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వెంకటేష్, మండల నాయకులు బాషా, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి దస్తగిరిబాషా, సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోనిలో తహసీల్దార్ రమేష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కౌలు రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకుని వ్యవసాయ రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని, వాటికి వత్తాసు పలుకుతున్న ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ శామ్యూల్‌పాల్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఆయా సంఘాల నాయకులు మహేంద్రబాబు, ఉదయ్, శేఖర్‌నాయుడు, అఫ్రిది, ఖాజ, రఘునాథ్ తదితరులు మాట్లాడారు.

15 నెలల్లో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు

- పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: 15నెలల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని, పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు అబద్ధాలు చెబుతూ తాను చెప్పేవన్నీ నిజాలని ప్రజలను నమ్మించడంలో దిట్ట అన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో తెచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను మంజూరు చేశారన్నారు. వాటిలో ఏడు కళాశాలల నిర్మాణాలు పూర్తయ్యాయని మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో వున్నట్లు స్వయాన కూటమి ప్రభుత్వ సమాచార శాఖ మంత్రి పార్థసారథి క్యాబినెట్ మీటింగ్ అనంతరం చెప్పారన్నారు. అయితే సీఎం చంద్రబాబు నాయుడు నిస్సిగ్గుగా కేవలం ఒక్క పాడేరు మాత్రమే పూర్తయిందని, అది తానే పూర్తి చేశానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. రూ.400 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు పెట్టి మెడికల్ కళాశాలలు, దానికి అనుబంధంగా ఆస్పత్రులను నిర్మిస్తే అప్పనంగా కేవలం రూ.5వేల అద్దెకు ప్రైవేట్‌కు అప్పగించడం దారుణమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్, రాష్ట్ర బీసీ విభాగం సంయుక్త కార్యదర్శి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కలిసిన ఎస్వీ

పట్టణంలోని శిల్పా ఎస్టేట్‌లో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి కలిశారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. తాను సంపూర్ణ ఆరోగ్యంగా వున్నానని ప్రతి రోజు తన పొలాలనికి వెళ్లి పంటలను చూసుకొంటూ కాలక్షేపం చేస్తుంటానని ఆయనకు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, యూత్ నాయకుడు ఎర్రకోట రాజీవ్‌రెడ్డి, పార్టీ నాయకులు రియాజ్‌అహమ్మద్, బుట్టారంగయ్య, భీమిరెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి పాటుపడాలి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు : మండల అధికారులతో పాటు మండలంలోని ప్రజా ప్రతినిధులు మండల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ శ్రీవిద్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ జయరాముడు ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన జనరల్‌బాడీ (సర్వసభ్య) సమావేశం నిర్వహించారు. ముందుగా మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. అభివృద్ధిపై ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇకపై అలా జరిగితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శిలు స్థానిక సర్పంచ్‌ల సహాయంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అదేవిధంగా మడలంలో రైతులు అధిక వర్షాలతో అతలాకుతలం అయ్యారని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంటనష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు.

అధికారులపై ప్రత్యేకాధికారి ఆగ్రహం

మండల అభివృద్ధిపై మూడు నెలలకు ఒకసారి జరుగుతున్న సర్వసభ్య సమావేశం అంటే మండలంలో పని చేస్తున్న అధికారులకు లెక్కే లేదని కార్యక్రమానికి హాజరైన ప్రత్యేకాధికారి నాగరాజారావు మండిపడ్డారు. గత కొన్ని సమావేశాలకు హాజరు కాని తహసీల్దారు, హౌసింగ్ ఏఈ, విద్యుత్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లకు సోకాజు నోటీసులు ఇవ్వాలని సంబంధిత ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం లోపించిందని పంచాయతీ కార్యదర్శిలు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా మండలంలో పని చేస్తున్న మండల స్థాయి అధికారులు సమగ్ర ప్రగతి నివేదికతో రావాలని పలుమార్లు సూచించినా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ ముత్తమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

11న కర్నూలుకు మందకృష్ణ రాక

ఆదోని రూరల్: అక్టోబర్ 11న కర్నూలుకు ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ రానున్నారని ఎంఎస్పీ జిల్లా కో ఇన్‌చార్జ్ బందారి హనుమంతు మాదిగ, జిల్లా ఉపాధ్యక్ష కార్యదర్శులు ఎస్.బాలన్న మాదిగ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సన్నాహక సభను విజయవంతం చేసేందుకు ఈనెల 18వ తేదీన కర్నూలులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం చేపడుతున్నట్లు చెప్పారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గోనెగండ్ల: విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విద్యుత్ జేఏసీ సంఘం నాయకులు రాయచోటి స్వామి, రంగస్వామి, మురళి డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.